క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధి జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జంతుక జంగయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబీకులను పరామర్శించారు. జంగయ్య పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళి అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, కేసీఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా, కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, రవీందర్, వెంకట్‌రెడ్డి, ప్రసాద్, రమేశ్, ఫిరోజ్, కొండల్, ఖాదర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ పాండుకు సత్కారం



విద్యాధికారిని సత్కరిస్తున్న డీఎస్పీ నాయకులు

ఆమనగల్లు: ఎంఈఓ పాండును శుక్రవారం ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఎంఆర్సీ కార్యాలయంలో పార్టీ జిల్లా కో కన్వీనర్ రమేశ్ ఆధ్వర్యంలో విద్యాధికారిని మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీకాంత్, ప్రవీణ్, వంశీ, మహేశ్ తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

తలకొండపల్లి: ఆమనగల్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బద్యా నాయక్ చౌహాన్‌ను గౌడ సంఘం గట్టు ఇప్పలపల్లి నాయకులు, సంఘం తాలూకా కన్వీనర్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం తాలూకా కన్వీనర్ అశోక్ గౌడ్, టీసీఎస్ చైర్మన్ నర్సింహ గౌడ్, ఆంజనేయులు గౌడ్, మల్లయ్య, వెంకటేశ్ గౌడ్, నిరంజన్, వెంకటయ్య, రవీందర్ గౌడ్, నరేందర గౌడ్, నవీన్ గౌడ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

మాడ్గుల: మండల పరిధి కోల్కులపల్లి గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మాజీ సర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కిషన్ రెడ్డి దంపతులు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో సాహితీ, దయాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బాలనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

కడ్తాల్: టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ ఎన్నికల అధికారిగా, రాములయ్య పరిశీలకుడిగా వ్యవహరించి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా శంకర్‌నాయక్, ఉపాధ్యక్షులుగా మల్లయ్యగౌడ్, కౌసల్య, కోశాధికారిగా సత్యనారాయణ, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా విజయ్‌కుమార్, జిల్లా సభ్యులుగా భీముడు, భాగ్యలక్ష్మీ, రవీందర్‌రెడ్డి, రఘుపతి, బీరప్ప, కృష్ణ ఎంపికయ్యారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, జీహెచ్‌ఎంలు శ్రీనివాసులు, పర్వతాలు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ఇబ్రహీంపట్నం రూరల్: మండల పరిధి ఎల్మినేడు గ్రామానికి చెందిన బెల్లి సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయనకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులను గమనించి వారికి కురుమ సంఘం సభ్యులు రూ.43 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఆ కుటుంబానికి సంఘం అండగా ఉంటుందని తెలిపారు. సంఘం గ్రామ అధ్యక్షుడు కొట్టాముల శ్రీనివాస్, పట్నం బాష, శ్రీశైలం, పట్నం కొండయ్య, సూద కృష్ణ, కొలను రాజు, అసనగారి రంజిత్, బజారు భిక్షపతి, సుల్తాని బాష పాల్గొన్నారు.


గ్రంథాలయం ఏర్పాటు చేయండి

ఇబ్రహీంపట్నం రూరల్: తులేకలాన్ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు కోరారు. పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనను నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రంథాలయం ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీనికి స్పందించిన ఆయన.. మాట్లాడుతూ.. రెండు రోజుల్లో గ్రామంలో పర్యటించి లైబ్రరీ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో వివేకానంద, జైభీమ్, పెద్దమ్మతల్లి, మహంకాళి యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్‌కు పోటాపోటీ

మహేశ్వరం వ్యవసాయ కమిటీ చైర్మన్ పదవిపై వీడని ఉత్కంఠ

- తీవ్ర నిరాశలో కాంగ్రెస్ కేడర్
- నామినేటెడ్ పదవుల కోసం గిరిజన నేతల కోసం ఆరాటం
- త్వరగా కమిటీని నియమించాలని పార్టీ శ్రేణుల డిమాండ్
- ఎనిమిది నెలలుగా నిలిచిన మార్కెట్ సేవలు



మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మహేశ్వరం: రైతులు, వ్యాపారులకు మధ్య అనుసంధానమైన వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలక వర్గం లేకపోవడంతో అన్నదాతలకు అందాల్సిన సేవలు నిలిచిపోయాయి. సుమారు ఎనిమిది నెలలుగా ఇటు పాలకవర్గం లేక, ప్రభుత్వ పర్యవేక్షణ కరువై కర్షకులు ఇబ్బంది పడుతున్నారు. పాలక వర్గం ఎప్పుడు ఏర్పాటు చేస్తారోనని ఎదురు చూస్తున్నారు. పాత కమిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి, నూతన కమిటీ ఏర్పాటు చేయకపోవడంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలన గందరగోళంగా మారింది.

మూడుసార్లు.. కందుకూరు వారే..

మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ రిజర్వేషన్లను బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో తొలి సారిగా నియమించింది. నూతనంగా ఏర్పాటైన మార్కెట్ కమిటీకి మొత్తం మూడు పర్యాయాలుగా కమిటీని ఏర్పాటు చేసింది. తొలి విడతలో ఓసీ మహిళ (గంగాపురం జ్యోతి), రెండో దఫా ఓసీ మహిళ (సురసాని వరలక్ష్మీ), మూడోసారి ఓసీ జనరల్ (సూరసాని సురేందర్‌రెడ్డి)లు నియమితులయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం నాలుగో విడతను ఎస్టీ జనరల్‌కు కేటాయించింది. అయితే ఇప్పటి వరకు చైర్మన్లుగా కొనసాగిన వారు కందుకూరు మండలానికి చెందిన వారేనని, ప్రస్తుతం ఎస్టీ జనరల్‌కు రిజర్వు కావడంతో ఈ సారి మహేశ్వరం మండలానికి చెందిన వారికి చైర్మన్, వైస్ చైర్మన్లుగా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. దీంతో అధికార పార్టీకి చెందిన మహేశ్వరం మండల గిరిజన నాయకులు చైర్మన్ గిరిని సొంతం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు వారి చుట్టూ తిరుగుతున్నారు.

నువ్వా.. నేనా

చైర్మన్ పదవికి తీవ్ర పోటీ నెలకొంది. అధికార పార్టీ గిరిజన నాయకులు ముందు వరుసలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ మండల మాజీ అధ్యక్షుడు ఉప్పుగడ్డతండాకు చెందిన నేనావత్ రాజు నాయక్, రామచంద్రగూడకు చెందిన అంగోత్ కృష్ణా నాయక్, గంగారంతండాకు చెందిన ఎం.పాండు నాయక్, పెద్దమ్మతండాకు చెందిన విఠల్ నాయక్‌లు పోటీలో ఉన్నారు. ప్రధానంగా నేనావత్ రాజు నాయక్, అంగోత్ కృష్ణా నాయక్‌ల మధ్యే పోటీ నెలకొందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

నామినేటెడ్ పదవుల కోసం ఆరాటం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం కావస్తున్నప్పటికీ.. నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల్లో ఏ ఒక్కరినీ నామినేటెడ్ పదవి వరించలేదు. గత ప్రభుత్వం నియమించిన పాలకవర్గం రద్దయి నెలలు గడుస్తున్నా.. కొత్త పాలకవర్గం ఊసేలేదు. జిల్లాలో అన్ని మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు కొలువుదీరాయి. కానీ మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎంపిక కాకపోవడంతో నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ నాలుగు నెలల క్రితం ముఖ్య నాయకుల సమావేశంలో వారం పది రోజుల్లో మార్కెట్ పాలకవర్గం నియమిస్తామని హామీ ఇచ్చారు. కానీ.. కాలం గడుస్తున్నా.. నామినేటెడ్ పదవుల ప్రస్తావన లేకపోవడంతో పార్టీ నాయకులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇప్పటికైనా కేఎల్లార్.. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడిన వారిని గుర్తించి, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు.

ప్రతిభను గుర్తించేందుకు 'చెకుముకి'



తలకొండపల్లి: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

విద్యాధికారి చాంప్లా నాయక్

తలకొండపల్లి: విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు 'చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు– 2024' నిర్వహిస్తున్నామని ఎంఈఓ చాంప్లా నాయక్, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీలక్ష్మిలు అన్నారు. శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నవంబర్‌లో 8,9,10 తరగతుల వారికి టెస్టు నిర్వహించనున్నామని, ఈ అవకాశాన్ని మండల పరిధి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంచడానికి జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు విష్ణుమూర్తి, రాములు, ప్రధానోపాధ్యాయుడు అంజయ్య, శ్రీనివాస్, ఐలయ్య, మల్లేశ్, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మాడ్గుల: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించబోయే చెకుముకి పోటీలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు వినియోగించుకోవాలని వేదిక జిల్లా అధ్యక్షుడు పర్వతాలు సూచించారు. ఈ సందర్భంగా పోటీ వాల్‌పోస్టర్‌ను ఇర్విన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏఈఓ సర్దార్ నాయక్ ఆవిష్కరించారు. అనంతరం వేదిక అధ్యక్షుడు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే పోటీల్లో పాఠశాలల నిర్వాహకులు విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి డిసెంబర్ 14,15,16న పోటీలు జరుగుతాయని వెల్లడించారు.

రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

తలకొండపల్లి: రహదారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ ఆమనగల్లు అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్ష నాయకులు అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. రోడ్ల మరమ్మతులతో పాటు, నూతన రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ అధికారంలో ఉండి.. గ్రామాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రోడ్లను అభివృద్ధి చేయాలని అప్పుడు గుర్తుకు రాలేదా అని, ప్రతిపక్షంలోకి వచ్చాక గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. అధికారం చేపట్టిన అనతి కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. కల్వకుర్తి నియోజకవర్గ బీటీరోడ్ల అభివృద్ధికి రూ.204 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు.

జాతర ఏర్పాట్లకు ముందస్తు చర్యలు

మంచాల: కార్తీక మాసంలో నిర్వహించే బుగ్గరామలింగేశ్వర స్వామి జాతర ఏర్పాట్లకు ముందస్తు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. శుక్రవారం ఆయన ఆరుట్ల గ్రామ పంచాయతీ పరిధి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. జిల్లాలోనే 15 రోజుల పాటు గొప్పగా స్వామివారి జాతర జరగనుందని పేర్కొన్నారు. వేడుకలకు రాష్ట్రంలోని వీఐపీలు, రాజకీయ నాయకులు, వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు.

గట్టుఇప్పలపల్లిలో స్వచ్ఛ భారత్

తలకొండపల్లి: మండల పరిధి గట్టుఇప్పలపల్లిలో ఆర్ఎస్ఎస్ శివాజీ శాఖ ఆధ్వర్యంలో యువకులు శుక్రవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. స్థానిక బండలగడ్డ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద పిచ్చి మొక్కలను తొలగించారు. నేలను చదును చేసి, ఆలయ పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో భాస్కర్, సాయిరాం, శరత్, మహేశ్, జంగయ్య, శేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుర్కయంజాల్: ఇంజాపూర్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం మునగనూర్ ఫీడర్, బాలాజీ నగర్ పరిధి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మునగనూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు బ్యాంక్‌కాలనీ, టెలిఫోన్‌కాలనీ, రామానుజనగర్, మల్లికార్జున నగర్, యాదాద్రి నగర్, ఆదర్శ నగర్, వడ్డెర బస్తీ, ప్రగతి నగర్, శనేశ్వర టెంపుల్, అంజనాపురి, మునగనూర్ గ్రామం, గణేశ్ నగర్, శివసాయిరామ్ నగర్‌లో సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బ్రాహ్మణపల్లి, శక్తి నగర్, బాలాజీ నగర్‌లో సరఫరాకు అంతరాయం కలగనుందని తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న అశోక్‌గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్త అశోక్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మాజీ సర్పంచ్ బుర్ర వీరస్వామి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నరేష్, పార్టీ నాయకుడు నవీన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్‌తో కలిసి ఆయన సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనతో యువత బీజేపీ వైపు మొగ్గు చూపుతుందన్నారు. ఇదిలా ఉండగా.. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఐలయ్యగౌడ్ బీజేపీలో చేరగా.. ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పార్టీ నాయకులు సత్యనారాయణ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, సతీష్, రమేష్, దశరథ, వీరేష్, రజనీకాంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన మున్సిపల్ కార్మికులు



మహాధర్నాకు వెళ్లిన కార్మికులు

ఆమనగల్లు: మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు, రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్.. నగరంలోని సీడీఎంఏ కార్యాలయం ఎదుట ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పట్టణంలోని కార్మికులు శుక్రవారం మహాధర్నాకు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో నాయకులు ఒగ్గు రవి, హంసమ్మ, యాదమ్మ, సురేశ్, శ్రీను, విజయ్, గోపాల్, పట్టాభి, సుగుణమ్మ తదితరులు ఉన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించవద్దు

యాచారం: వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత రైతులకు సూచించారు. యాచారం మండలంలో త్వరలో ప్రారంభించనున్న ధాన్య కొనుగోలు కేంద్రాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో యాచారం, మంతన్‌గౌరెల్లి, ఐకేపీ ఆధ్వర్యంలో చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వరి కోతలు కొద్ది రోజుల్లోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని, రైతులు తమ దిగుబడిని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్ ఉన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

- విద్యార్థి నాయకుల డిమాండ్
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా



తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ కార్యదర్శి ఏర్పుల తరంగ్ డిమాండ్ చేశారు. పట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్ల కాలంలో రూ.8,243 కోట్ల మేర బకాయి పేరుకుపోయిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదని, ప్రజాపాలన అందిస్తామని అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కార్.. పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు వంశీ, చరణ్, శ్రీకాంత్, లక్ష్మణ్, రాకేష్, శివ, సందీప్ పాల్గొన్నారు.

'ఆసరా' పెంచేంత వరకు పోరాటం

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: ఆసరా పింఛన్ పెంచేంత వరకు పోరాటం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని ఎంఎం గార్డెన్‌లో శుక్రవారం పింఛన్ దారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 5 వరకు లబ్ధిదారులకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఆసరా, వికలాంగుల పింఛన్లు తదితర వాటి గురించి మాట్లాడుతున్నారే తప్ప.. ఆ తరువాత వాటి గురించి రాజకీయ నాయకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆసరా లబ్ధిదారులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి నవంబర్ 26న ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, సంయుక్త కార్యదర్శి సంజీవ, జిల్లా ప్రచార కార్యదర్శి బానుప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శంకర్



కలెక్టర్ శశాంకను కలిసిన ఎంపీడీఓ బాలశంకర్ తదితరులు

మంచాల: ఎంపీడీఓల సంఘం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపీడీఓ బాలశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన ఎంపీడీఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా మంచాల ఎంపీడీఓ, ప్రధాన కార్యదర్శిగా బి.సంధ్య(ఎంపీడీఓ, మొయినాబాద్), కోశాధికారిగా శ్రీకాంత్(ఎంపీడీఓ, తలకొండ పల్లి), ఉపాధ్యక్షుడిగా మున్ని(ఎంపీడీఓ, శంషాబాద్), ఈసీ సభ్యులుగా ప్రవీణ్ (జిల్లెడ్ చౌదరిగూడ, ఎంపీడీఓ), హిమబిందు (చేవెళ్ల, ఎంపీడీఓ), సుజాత నాయక్(కడ్తాల్, ఎంపీడీఓ)లను ఎనుకున్నారు. అనంతరం కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్డీఓ శ్రీలతను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పీఈటీ డిప్యుటేషన్‌ను రద్దు చేయండి



ఎంఈఓ పాండుకు వినతిపత్రం అందజేస్తున్న విజయ్‌రాథోడ్

ఆమనగల్లు: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న జ్యోతి డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌రాథోడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంఆర్సీ కార్యాలయంలో శుక్రవారం ఎంఈఓ పాండుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పీఈటీ జ్యోతిని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తాటి అన్నారం ఉన్నత పాఠశాలకు నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్‌పై పంపించారని ఆరోపించారు. 270 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో.. పీఈటీ లేకపోతే చిన్నారులు క్రీడలకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే ఆమె డిప్యుటేషన్‌ను రద్దుచేసి, ఆమనగల్లు పాఠశాలలో పనిచేసేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనునాయక్, రాజ్‌కుమార్, కిషన్‌నాయక్, బద్రునాయక్ తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



పట్నం డిపో నూతన కార్యవర్గం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఐఎన్‌టీయూసీ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి నూతన కమిటీని ఎంపిక చేశారు. డిపో అధ్యక్షుడిగా ఎండీ సీరాజ్(డ్రైవర్), కార్యదర్శిగా పరమేష్(కండక్టర్), కోశాధికారిగా బాలకిషన్(కండక్టర్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ఎంఏ జీయావుద్దీన్, డిపో మాజీ కార్యదర్శి సీహెచ్ యాదగిరి, మాజీ అధ్యక్షులు అశోక్, జంగయ్య, వెంకటేశ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. మహిళా ప్రతినిధులుగా కల్పన, సునీత, మంజులను నియమించారు.

కృత్రిమ ఇసుక తయారు చేస్తే చర్యలు

తహసీల్దార్ నాగార్జున



ఇసుక శుద్ధి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

తలకొండపల్లి: కృత్రిమంగా ఇసుక తయారు చేసినట్లు రుజువైతే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగార్జున హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం మండల పరిధి చుక్కాపూర్‌లో ఇసుక తయారీ కేంద్రంపై తహసీల్దార్ ఆధ్వర్యంలో.. రెవెన్యూ సిబ్బంది దాడి చేశారు. ఇసుక ఫిల్టర్‌ను ధ్వంసం చేశారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఆర్ఐ మంజుల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దడ పుట్టిస్తున్నాయ్..

- గుంపులుగా వీధికుక్కల సంచారం
- భయాందోళన చెందుతున్న ప్రజలు



గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

కడ్తాల్: వీధి కుక్కల సంచారం స్థానికులకు దడపుట్టిస్తోంది. గుంపులుగా సంచరిస్తూ.. ఓరగా చూస్తూ.. గుర్రుమంటుండటంతో.. ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శునకాల బెడదతో ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. పిల్లలు బడికి వెళ్లేందుకు భయపడుతున్నారు. నడుచుకుంటు వెళ్తున్న వారితో పాటు, వాహనదారులపై అకారణంగా దాడులకు తెగబడుతున్నాయని ప్రాంత వాసులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, కుక్కలను తరలించాలని కోరుతున్నారు.